చీకటిబాటున సత్యం

పాలకూర సీతాలత

చేతిలో సూట్‌కేస్‌తో స్టేషన్ బైటకు రాగానే ఆటోవాళ్లు నా చుట్టూమూగారు, బెల్లంచుట్టూచేరే ఈగల్లాగ. వాళ్లందర్నీ తప్పించుకుని మామూలురిక్షాలో బయలుదేరాను సత్యం ఇంటికి. స్టేషన్‌కు వాళ్ల ఇల్లు దగ్గరే అని వాడు రాశాడు మరి.

అప్పుడే తెల్లవారడంవల్ల కాటోలు రోడ్లమీద ఇంకా అంతగా ట్రాఫిక్‌లేదు. బజార్లో కొట్లన్నీ మూతపడేవున్నాయి. సత్యం ఎనిమిది గంటలకు ఫ్యాక్టరీకి వెళ్లిపోతాడు. అంతకు ముందే నేను ఇల్లు చేరుకునేలా ఈ ట్రెయిన్లో ప్రయాణం పెట్టుకున్నాను.

రిక్షా ముందుకు సాగుతుంటే నా ఆలోచనలు వెనక్కి గతంలోకి వెళ్లాయి. సత్యంతో నా పరిచయం ఆరేళ్లనాటిది. నేను ఇంజనీరింగ్ కాలేజీలో చేరేసరికి సత్యం అందులోనే మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరం ఒక ఊరి వాళ్లమే. నేను కాలేజీలో చేరడానికి వెళ్తున్నప్పుడు సత్యంవాళ్ల నాన్నగారు సత్యం పేర ఒక ఉత్తరం ఇచ్చి నన్ను అతన్ని కలుసుకోమన్నారు. నాకు కావల్సిన సహాయం అతను చేస్తాడని చెప్పారు.

ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలలో కొత్తగా చేరిన విద్యార్థులని సీనియర్స్

ఏడ్పించే 'రాగింగ్' అనే పద్ధతి ఒక టుంది. నేను దానికి గురికాకుండా సత్యం కాపాడాడు. బెదిరిపోతున్న నాకు ధైర్యం చెప్పాడు. నన్ను తనతోపాటు అతని హాస్టల్ రూంలో వుంచుకున్నాడు. ఈ 'రాగింగ్' పూర్తిఅయ్యాకనే నేను నా హాస్టల్‌కు వచ్చాను. సత్యం చాలా తెలివైన విద్యార్థి. చదువులోను, ఆటల్లోనూ కూడా ముందు వుండేవాడు. నాకు అర్ధంకాని పాఠాలు బోధిస్తూ వుండేవాడు. సత్యంతో పరిచయం కావడం నా అదృష్టంగా భావించేవాడిని. ఇద్దరం ఒక బ్యాచివాళ్ళం కాకపోయినా ఇద్దరం కలిసే సాయంత్రాలు గడపడం, సినిమాలు చూడటం, ఒకే మెస్సులో కల్సి భోజనం చెయ్యడం-చూస్తూండే వాళ్ళం.

అతని చదువు పూర్తికావడంతో అతను వెళ్ళిపోయాడు. నిజంగానే నేను చాలా బాధపడ్డాను. కానీ, చెయ్యగలిగేది ఏముంది? అతని అదృష్టం కొద్దీ టెంపరరీదే అయినా వైజాగ్‌లో ఉద్యోగం దొరికింది. ఆ తర్వాత ఏడాదికి ఆ ఉద్యోగం వదిలేసి ఈ ఊరు వచ్చేశాడు. అసిస్టెంట్ ఇంజనీర్‌గా మంచి ఉద్యోగం దొరకడంతో అతను ఇక్కడకు వచ్చి రెండేళ్ళు అయింది.

కాలేజీ విడిచిపెట్టాక అతన్ని నేను కల్సుకోకపోయినా, మా ఇద్దరి మధ్యా ఉత్తరాలు నడుస్తుండటంవల్ల అతని వివరాలు నాకు తెల్సు.

నేను ఇంజనీరింగ్ ప్యాసయ్యి ఏడాది అయింది. అయినా ఇంతవరకూ ఉద్యోగం సంపాదించుకోలేకపోయాను. ఇప్పుడు ఈ ఊరు రావడం కూడా అందు కోసమే. ఒక ఇంటర్వ్యూ అటెండు కావడం కోసం.

ఈ ఇంటర్వ్యూ గురించి సత్యంకి రాశాను. కనీసం ఒక రెండు రోజులు ఎక్కువగా వుండేలా రమ్మనీ, ఈ రకంగానైనా నన్ను చూసే అవకాశం కల్గినందుకు సంతోషం అనీ రాశాడు. వాడితోను మరో రోజు గడపాలనే ఉద్దేశ్యంతో ఇంటర్వ్యూ రేపు అయినా, ఈ రోజే వచ్చి చేరాను.

రిక్షా ఆగడంతో నా ఆలోచనలూ ఆగిపోయాయి. రిక్షావాడిని పంపి ఇంటి నంబరు చూసి తలుపు తట్టాను. మరో సారి తలుపుమీద చప్పుడు చేశాక తలుపు తెరుచుకుంది. కానీ.... ఎదురుగా ఓ అమ్మాయి.

ఆ అమ్మాయిని చూసి ఆశ్చర్యపోయాను. అది సత్యం ఇల్లా, కాదా అని సందేహంతో తలుపుమీది నేమ్ ప్లేట్ మరోసారి చూశాను. సందేహం లేదు. అది సత్యం ఇల్లే. అయితే ఈమె ఎవరు? నాకు తెల్సినంతవరకూ సత్యంకి ఇంకా పెళ్ళికాలేదు. ఆ అమ్మాయివైపు చూశాను. అందంగా దిద్ది తీర్చిన ముఖం. ఆకర్షణీయమైన కళ్ళు. తెల్లని రంగు. అయిదున్నర అడుగుల పొడవు,

సుమారుగా. అప్పటిదాకా పనిపాటల్లో తేలి వున్నట్లు జడనే ముడిగా మార్చుకుంది. అయినా కొన్ని ముంగురులు ముఖంని ముద్దాడ తున్నాయి.

"అలా నిలబడిపోయి ఏమిటి ఆలోచిస్తున్నావు కౌండిన్యా?" అంది ఆమె.

ఆశ్చర్యపోయాను. ఆమెకు నాపేరు ఎలా తెల్సిందా అని.

"ముందు లోపలకు రా! తర్వాత ఆలోచించవచ్చు." అంటూ నేను లోపలకు వెళ్లడానికి దారి ఇచ్చింది.

లోపలకు నడిచాను.

"అన్నయ్య స్నానం చేస్తున్నాడు. కూర్చో కాఫీ ఇస్తానుండు నిన్ను ఏకవచనంలో సంభోదిస్తున్నందుకు ఆశ్చర్యపడుతున్నావు కదూ... నన్ను గుర్తించలేదు కదూ!.. నేను.. మృదులను" అంది ఆమె.

అప్పటికి అర్థం అయింది. మృదుల సత్యం చెల్లెలు. ఆమెను చూసి కూడా నాలుగేళ్లు కావటంతో ఆమెను గుర్తించలేకపోయాను. పైగా పొంగివచ్చిన యవ్వనం కూడా ఆమెలో మార్పు తెచ్చింది. ఆమెను నేను ఈ మధ్య చూడకపోయినా ఆమె గురించి ప్రతి ఉత్తరంలోనూ సత్యంని అడుగుతుండే వాడిని. ఆ చనువుతోనే నన్ను అలా పలుకరించింది. ఆమె ప్రస్తుతం బి.ఏ. పూర్తిచేసి ఖాళీగా వుంటోందని విన్నాను. అన్నగార్ని చూడ్డానికి బహుశా ఇక్కడకి వచ్చిందేమో!

ఇంతలో సత్యం వచ్చాడు. నా చేతిలో చెయ్యి వేస్తూ 'ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు?...' అన్నాడు. ఆప్యాయంగా కుశల ప్రశ్నలు వేశాడు. ఇంతలో కాఫీ తెచ్చింది మృదుల.

"మృదులను గుర్తించావు కదూ! నాకు తోడుగా వుంటుందని ఇక్కడకు పిలిపించాను. అందువల్ల హోటల్ కూడు తినే ఖర్మకూడా తప్పింది..." అన్నాడు.

ఆ తర్వాత ఫ్యాక్టరీకి వెళ్లడానికి తయారయ్యాడు.

"భోజనం చేసి విశ్రాంతి తీసుకో. సాయంత్రం అలా ఫ్యాక్టరీవైపు రా. ఇద్దరం కాస్సేపు తిరిగివద్దాం నువ్వొచ్చినందుకు వెళ్లకూడదనుకున్నా అర్జంటు పని వుండటంతో తప్పలేదు.." అన్నాడు.

"భలేవాడివి! డ్యూటీ మానెయ్యడం ఎందుకు? నువ్వు వెళ్లు ..." అన్నాను. ఆ తర్వాత సత్యం వెళ్లిపోయాడు.

స్నానం చెయ్యడానికి వేడినీళ్లు ఇచ్చింది మృదుల. ప్రయాణంలోని అలసట అంతా ఎగిరిపోయింది స్నానం చెయ్యడంతో. ఆ తర్వాత ఆమె పెట్టిన టిఫిన్ తిన్నాను. అంతసేపూ మృదుల మా యింట్లో వాళ్ల క్షేమసమాచారాలు అడిగింది. నా ఉద్యోగ ప్రయత్నాల గురించి అడిగింది.

బట్టలు మార్చుకుని అక్కడికి దగ్గర్లోవున్న బజారు రోడ్లు సర్వేచేసి తిరిగి పదకొండు గంటల ప్రాంతంలో ఇల్లు చేరాను. ఆమె వడ్డించిన భోజనం చేశాను. ఆ తర్వాత హాల్లోనే మడత మంచం వాల్చి పడుకోమంది. రాత్రి సరిగా నిద్రలేదేమో గాఢంగా నిద్ర పోయాను.

నిద్ర లేచేసరికి నాలుగయ్యింది. ముఖం కడుక్కుని బట్టలు మార్చుకునే సరికి మృదుల 'టీ' కప్పుతో సాక్షాత్కరించింది. ఆమె ఎంతో శ్రద్ధగా ఈ పన్లు అన్నీ చేస్తుంటే కన్నతల్లి గుర్తు రాక మానదు.

"చాలా థాంక్స్ మృదులా! నా కోసం చాలా శ్రమ తీసుకుంటున్నావు..." అన్నాను.

"నువ్వేదో పరాయివాడివి అయినట్లు అదేం మాట? అయినా ఇందులో శ్రమ ఏముంది? నీకోసం ప్రత్యేకంగా ఏమీ చెయ్యటంలేదు కదా! మాతోపాటే నువ్వూను..." అంది సన్నగా నవ్వుతూ.

ఎంత అందంగా నవ్వింది!! ఈమెను కట్టుకోబోయేవాడు ఎవరో కానీ అదృష్టవంతుడే.

వెళ్తానని చెప్పి బైటపడ్డాను.

సత్యం ఇచ్చిన చిరునామా పట్టుకుని వెతుక్కుంటూ వెళ్లాను.

వాడు పనిచేస్తున్న ఫ్యాక్టరీ చాలా పెద్దది. చాలా బిజీగా వున్నాడు. ఆరు గంటలదాకా వాడి పని తెమలలేదు.

"ఇద్దరంతా ఓ పెద్ద మెస్. నేను కల్పించుకోనిదే ఏదీ కాదు. అర్ధరాత్రి మా ఇంట్లో ఫోను మ్రోగితే అది ఫ్యాక్టరీ నుంచి అనే అర్థం. నైట్ షిఫ్టులో ఏదో చెడిపోయిందనే అనుకోవాలి. అందుకే రాత్రిపూట మ్రోగే ఫోను అంటే భయం నాకు...." అన్నాడు.

ఆ తర్వాత ఇద్దరం కాస్సేపు బజార్లు సర్వే చేశాం. ఒకరిద్దరు స్నేహితుల ఇంటికికూడా తీసుకెళ్లి పరిచయంచేశాడు. రాత్రి ఇల్లు చేరేసరికి ఎనిమిది అయింది. భోజనాలు చేశాక పదకొండు గంటల దాకా హస్కు కొడుతూ కాలం గడిపాం. నేను నా నిరుద్యోగపు అనుభవాలు, వాడు తన ఉద్యోగపు అనుభవాలూ చెప్పు కున్నాం. ఆ తర్వాత కాస్సేపు మా కామన్ ఫ్రెండ్స్ గురించి మాట్లాడు కున్నాం.

అప్పటికే మృదుల లోపల గదిలో నిద్రపోతోంది. సత్యం కూడా వెళ్లి పోయాడు పడుకుందుకు. నేను హాల్లోనే మంచంమీద పడుకున్నాను.

ఆ రాత్రి నిద్రలో వుండగా లీలగా మెళకువ వచ్చింది. సన్నగా ఏవో కబుర్లు విన్పించాయి. అది కలో, నిజమో కూడా తెలియని స్థితిలో వుండిపోయాను. కళ్లు విప్పుదామన్నా రెప్పలు లేవలేదు. వీధి తలుపు తీసిన చప్పుడు, ఆ తర్వాత వేసిన చప్పుడు. వీధి మెట్ల మీద అడుగుల సవ్వడి – సన్నగా విన్పించాయి. అది బహుశా కలకావచ్చు అనుకున్నాను.

మరి కాస్సేపటికి దాహంవేసి మెళకువ వచ్చింది. లేచి కూర్చున్నాను. మధ్య గదిలో లైటు వెలుగుతూ కన్పించింది. రాత్రి పడుకునే ముందు సత్యం ఆ లైటు ఆర్పడం నాకు బాగా గుర్తు. మళ్లీ ఎవరు వేసి వుంటారు? లోపలకు తొంగి చూశాను. ఏ రకమైన అలికిడీ లేదు. హాల్లో నా కోసం ప్రత్యేకంగా మంచినీళ్లు పెట్టలేదు. కనుక దాహం తీర్చుకుందుకు సత్యం గదిలోకో, వంటింట్లోకో వెళ్లాలి. అనవసరంగా ఇప్పుడు మృదుల నిద్ర పాడుచెయ్యడం ఎందుకు? అందుకే లోపలకు నడిచాను.

వంటింట్లోకి వెళ్లబోతూ సత్యం పడుకునే గది కర్టెను తలుపు పైకి వేసి వుండటంతో అప్రయత్నంగా లోపలకు చూశాను.... ఆశ్చర్యం....గదిలో రెండు మంచాలూ ఖాళీగా వున్నాయి. మృదుల గానీ, సత్యంగానీ కన్పించలేదు. అంత వరకూ మంచంమీద నిద్రపోయినట్లుగా కొద్దిగా నలిగిన పక్క, కాళ్ల వైపు కుప్పగా పడివున్న దుప్పట్లు సాక్ష్యం ఇచ్చాయి. అయితే మరి వాళ్లు ఏరీ? ఇంతరాత్రివేళ ఎక్కడకు వెళ్లివుంటారు?

ఇందాకా నాకు విన్పించిన శబ్దాలు కలలోవి కాదు అన్పించింది. దాహం విషయం మర్చిపోయి గబగబా వీధి తలుపు దగ్గరకు వెళ్లాను. ఆ తలుపు గడియ రాత్రి నేనే వేశాను. ఇప్పుడది తెరిచి వుంది. తలుపు లోపలకు లాగాను. రాలేదు. అంటే....? బైట వైపు గడియ పెట్టి వుండాలి. లేదా తాళంవేసి వుండాలి.

అంటే అర్థం? అన్నా చెల్లెళ్లు ఇద్దరూ ఇంట్లో లేరు. బైట తాళంపెట్టుకుని ఈ రాత్రివేళ ఎక్కడికో వెళ్లారు. అయితే నన్ను లేపలేదేం?

ఇంత రాత్రివేళ వీళ్లకు బైటకు వెళ్లవల్సిన పని ఏమిటి?

నేను నిద్రపోతున్నాను కనుక లేపడం ఎందుకని అనుకున్నారో లేక ఈ విషయం నాకు తెలియకూడదని అనుకున్నారో తెలియదు కానీ నన్ను లేపి తలుపులేసుకోమని చెప్పకుండా బైటనే తాళం వేసుకుని వెళ్లారు.

బహుశా తెల్లవారేలోగానే వాళ్ళు తిరిగి రావచ్చు. ఆ తిరిగిరావడం నాకు తెలియాలి. అందుకే వీధి తలుపును లోపల గడియవేశాను. తాళం తీసినా తలుపు రాదు కనుక లోపలిగడియ తియ్యడంకోసం నన్ను లేపితీరాలి వాళ్లు.

ఆ తర్వాత మంచినీళ్ళు తాగి నిద్రపోయాను.

ఎవరో తలుపు కొడుతున్న చప్పుడు అయ్యింది. లేచి కిటికీలోంచి చూశాను. వెలుగు వచ్చేసింది. టైము ఆరున్నర అయ్యింది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని తలుపు తీశాను. గుమ్మందగ్గర చేతిలో తాళంకప్ప పట్టుకుని మృదుల నిలబడి వుంది. సత్యం జాడలేదు. ఆమె ముఖం కూడా అప్పుడే నిద్రలేచినదానిలా వుంది.

ఏం మాట్లాడడానికీ అది సమయం కాదని మళ్ళీ వెళ్ళి పడుకున్నాను. మృదుల లోపలకు వెళ్ళిపోయింది.

ఏడున్నర అవుతుండగా లేచి ముఖం కడుక్కున్నాను. కాఫీ తెచ్చింది మృదుల. మాట్లాడకుండా తాగేశాను.

"స్నానానికి నీళ్ళు రెడీగా వున్నాయి" అంది.

స్నానం చేసి వచ్చేసరికి టిఫిన్ పెట్టింది. అది తిని రెండో రౌండు కాఫీ తాగాను. పదిగంటలకు ఇంటర్వ్యూ. తొమ్మిదికయినా బయలుదేరాలి.

"మృదులా! నిన్నో విషయం అడగనా?" అన్నాను.

"నిన్న రాత్రి మేం బైటకు వెళ్ళడం గురించేనా?" అంది మృదుల కొంచెం చిన్నతనంగా.

అవునన్నట్లుగా తల వూపాను.

"అయితే చెప్తాను విను...." అంది.

ఆమె చెప్పడం ప్రారంభించింది.

* * *

ఆ రాత్రి సుమారు ఒంటిగంట ప్రాంతంలో సత్యానికి ఫ్యాక్టరీనుంచి ఫోను వచ్చింది. ఏదో మిషను పాడైనందుకు ప్రొడక్షన్ ఆగిపోయింది. సత్యం వెంటనే ఫ్యాక్టరీకి వెళ్ళాలి.

బట్టలు మార్చుకున్నాడు సత్యం. మృదులను లేపాడు.

"నేను అత్యవసరంగా ఫ్యాక్టరీకి వెళ్తున్నాను..." అన్నాడు.

"సరే... వెళ్ళు...."అంది బద్ధకంగా మృదుల మంచంమీదే అటుపక్కకు తిరిగి పడుకుంటూ.

"ఎలా వెళ్ళను?" అడిగేడు.

"ఏం? సూ్కటర్ వుందిగా...." అంది మృదుల తేలిగ్గా.

"ఇంట్లో నువ్వు ఒక్కతివీ వున్నా ఇలాగే వదిలేసి వెళ్ళేవాడిని. కానీ హాల్లో ఇప్పుడో పరాయి మగవాడు వున్నాడు. మీ ఇద్దర్నీ ఈ రాత్రివేళ వదిలి " నసిగేడు సత్యం.

ఆశ్చర్యంగా కళ్ళు విప్పింది మృదుల. ఆమె నిద్ర అంతా ఆ మాటలకు ఎగిరిపోయింది.

"అంటే నీ ఉద్దేశ్యం? నేనంత నీచమైన.. "

"నీ గురించి కాదు....".

"అయితే కౌండిన్య అంత నీచమైన ......"

"అతని గురించి కాదు...."

"మరి...."

"లోకం గురించి. వయసులో వున్న మీ ఇద్దర్నీ ఇలా రాత్రిపూట వంటరిగా వదిలినట్లు తెలిస్తే...."

"ఎలా తెలుస్తుంది?...."

"ఏమో!...."

"అయితే ఏమంటావు? నేను కూడా నీతో ఫ్యాక్టరీకి రానా?" కోపంగా అంది.

"అక్కర్లేదు. బైట తాళం పెడదాం. నిన్ను పక్కింటి పార్వతమ్మ గారింట్లో వదిలేస్తాను. అక్కడే పడుకో. తెల్లవారాక తాళం తీసుకుని రా."

"ఈ విషయం కౌండిన్యకు తెలిస్తే..?"

"తెలియదు. వాడిది మొద్దునిద్ర. ఆ విషయం నాకు తెలుసు. వాడు లేచే అవకాశం లేదు. వాడు నిద్ర లేచేలోగానే నువ్వు వచ్చేస్తావు. ఇంకెలా తెలుస్తుంది?"

"ఈ పద్ధతి నాకైతే ఏం నచ్చలేదు. నామీదా, అతనిమీదా నీకు నమ్మకం లేక పోవడమే దీనికి కారణం అని అనుకోవల్సి వస్తోంది...."

"నువ్వు ఏమైనా అనుకో మృదులా, నేను చెప్పినట్లు జరగవల్సిందే. ఆలస్యం చెయ్యకుండా త్వరగా బయల్దేరు. నేను అర్జంటుగా వెళ్లాలి మరి...."

మృదుల ఇంక మరేమీ మాట్లాడలేక పోయింది. గుండెల్లోంచి అభిమానం పొంగివస్తున్నా అన్నగారిని ఎదిరించే ధైర్యం లేకపోయింది.

'మనసులో ఎలాంటి దురభిప్రాయమూ లేకపోయినా ఏ సంబంధమూ లేని ఒక అమ్మాయి, ఒక అబ్బాయి కల్సి వుండడానికి లోకం ఒప్పుకోదు కాబోలు' అనుకుంది.

'అన్నయ్య భయంలో నిజం వుందా? జరగకూడనిది జరిగే అవకాశం వుందా? కౌండిన్యను చూస్తే మర్యాదస్తుడిలాగ, పెద్దమనిషిలాగ అన్పిస్తున్నాడు. అతన్ని ఇంత నీచంగా తలపోయడం ఎంత వరకు సబబు?'

"త్వరగా బయల్దేరు మరి!........" మరోసారి తొందరపెట్టాడు సత్యం.

ఇక తప్పదన్నట్లుగా లేచి బయలు దేరింది మృదుల.

ఇద్దరూ తలుపుబైట తాళం పెట్టేక, పార్వతమ్మగారిని లేపారు.

సంగతంతా విని ఆవిడ అంది—

"నిజమే బాబూ! మంచిపని చేశావు. ఆమె ఈ రాత్రికి ఇక్కడే పడు కుంటుందిలే. పరాయి మగాడు ఇంట్లో వుండగా ఆమె ఎలా పడుకోగలదు?.... నువ్వు వెళ్లిరా బాబూ...."

ఆ తర్వాత స్కూటరెక్కి వెళ్ళి పోయాడు సత్యం.

* * *

సంగతంతా విన్నాక నాలో ఎక్కడ లేని అభిమానమూ పొడుచుకొచ్చింది. నన్నింత నీచంగా ఎలా జమకట్టకలిగేడు సత్యం?

ఇన్ని సంవత్సరాల స్నేహంలో అతను నా ప్రవర్తనని సరిగా అర్థం చేసుకోలేకపోయాడా?

"ఏది ఏమైనా జరిగినదానికి నేను చాలా సిగ్గుపడుతున్నాను. మా అన్నయ్య తరపున క్షమార్పణలు కోరుతున్నాను ...." అంది మృదుల.

"ఫర్వాలేదులే! ఈ విషయం నాకు తెలియదనే నమ్మకంతోటే సత్యం వున్నాడు కనుక నాకు ఈ విషయం తెల్సిందన్నట్లుగా నువ్వు అతనికి చెప్పకు. నాకు ఏమీ తెలియదనే అతన్ని అనుకోనీ ..." అన్నాను.

ఇంటర్వ్యూ లెటర్, ఇతర సర్టి ఫికెట్లు సర్దుకుని బయల్దేరబోతుండగా సత్యం వచ్చాడు.

"బయల్దేరుతున్నావన్నమాట. గుడ్.... విష్ యు బెస్టాఫ్ లక్...." అన్నాడు.

"థాంక్స్.... అన్నట్లు ఇప్పుడు నువ్వు మళ్లీ వెళ్లాలా?" అన్నాను.

"ఇప్పుడు వెళ్లను. ఇప్పుడు కాస్సేపు నిద్రపోతాను. మధ్యాహ్నం భోజనం చేసి వెళ్తాను." అన్నాడు.

అతనితో చెప్పి వెళ్లబోతుంటే అన్న గారికి కాఫీ తెచ్చి ఇచ్చిన మృదుల వెనకనుంచి—

"బెస్టాఫ్‌లక్..." అంది చిర్నవ్వుతో.

"థాంక్యూ వెరీమచ్.... మీ నోటి చలువ వల్లనైనా ఈ ఉద్యోగం వస్తే..."

"ఊఁ!.... వస్తే?" రెట్టించి అడిగింది.

"మీకు ఋణపడి వుంటాను...." అన్నాను.

"భలే చెప్పావు...."

బైటకొచ్చి ఆటో ఎక్కాను.

ఇంటర్వ్యూ తతంగం మామూలుగానే ముగిసింది.

చెయ్యవల్సిన పనికి ఏమాత్రమూ సంబంధించని ప్రశ్నలు అడిగారు.

అమెరికా విదేశాంగ మంత్రి ఎవరో చెప్పమన్నారు. బీహారు ముఖ్యమంత్రి ఎవరని అడిగారు. ఇరాన్‌లో అల్లర్ల

గురించి ప్రశ్నించారు. ఆ తర్వాత ఇంజనీరింగ్‌కు సంబంధించిన రెండు ప్రశ్నలు వేశారు. అపైన ఇక వెళ్ళమన్నారు.

ఆ ఉద్యోగం వస్తుందన్న నమ్మకం లేకపోయింది.

ఇల్లు చేరేసరికి టైము రెండు దాటింది.

భోజనం చేసి సూట్‌కేస్ సర్దుకోసాగాను. అది చూసి మృదుల అడిగింది.

"అదేం? అప్పుడే వెళ్ళిపోదామనే?"

"అవును."

"రెండు మూడు రోజులపాటు నువ్వు వుంటావని చెప్పాడు అన్నయ్య."

"నేనూ వుండాలనే అనుకున్నాను."

"మరి."

"ఏంలేదు. మిమ్మల్నందర్నీ ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక. మళ్ళా ఈ రోజు రాత్రి కూడా సత్యం ఫ్యాక్టరీకి వెళ్ళవల్సి వస్తే, నువ్వు మరొకరి ఇంట్లో పడుకునే శ్రమ నీకు ఇయ్యకూడదని." అన్నాను ఆమె ముఖంలోకి చూస్తూ.

"కొండిన్యా." అంది బాధగా. దెబ్బ తిన్నట్లు చూసింది.

"ఫర్వాలేదు. డోంట్‌వర్రీ... సాయంత్రం నాకు ట్రెయినుంది. ఫ్యాక్టరీకి వెళ్ళి సత్యాన్ని కలిసి అట్నుంచి వెళ్ళిపోతాను."

ఆమె మరేం మాట్లాడలేదు.

ఆమెకు వెళ్తున్నానని చెప్పి సూట్‌కేస్‌తో బైటపడ్డాను. సత్యాన్ని కలిశాను. మరో రెండు రోజులు వుండమన్నాడు.

"సారీరా! నువ్వేం అనుకోకు. మా ఫాదర్‌కి వంట్లో బాగోలేదు. వెంటనే వెళ్ళిపోవచ్చునని వచ్చాను. మొందసలు ఇంటర్వ్యూకే రావద్దనుకున్నాను కానీ అవకాశం ఎందుకు వదులుకోవాలని వచ్చాను." అంటూ అబద్ధం ఆడేను.

ఇంకేం అభ్యంతరం చెప్పలేదు.

"వెళ్ళగానే మీ నాన్నగారు ఎలా వున్నారో తెల్పుతూ ఉత్తరం రాయి." అన్నాడు.

సరేనని వచ్చేశాను.

* * *

మూడు నెలలు గడిచాయి. నాకే ఆశ్చర్యం కలిగేలా నాకు ఉద్యోగం ఇచ్చారు కంపెనీవాళ్లు. పోస్టింగ్ కూడా సత్యం వుంటున్న ఊళ్లోనే.

అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ చూసుకుని మురిసిపోయాను.

ఆ తర్వాత మరో నెలకి ఉద్యోగంలో చేరిపోయాను.

కొత్తలో ఒక వారం రోజులు సత్యంతోపాటే ఉన్నాను. మృదుల వాళ్లింటికి వెళ్ళిపోవడంతో సత్యం ఒక్కడే వుంటున్నాడు. అందుకే వారం రోజులైనా వాడితో వున్నాను.

తనతోటే వుండిపొమ్మనాడు కానీ కంపెనీకి దూరం అవుతుందని నచ్చచెప్పి వేరే పోర్షన్ తీసుకున్నాను.

విడివిడిగా వుంటున్నా మేం ఇద్దరం తరుచు కల్సుకుంటూనే వున్నాం.

కలవు .వచ్చిందంటే వాడు ఇటు వచ్చెయ్యడమో, నేను అటు వెళ్ళడమో చేస్తున్నాం. కలిసే సినిమాలు చూస్తున్నాం.

అలాగే మరో నాల్గు నెలలు గడిచి పోయాయి.

ఒకరోజు ఆదివారంనాడు ఉదయమే నా దగ్గరకు వచ్చాడు సత్యం.

"ఒరేయ్! మా మృదుల మీద నీ అభిప్రాయం ఏమిటి?" అడిగేడు.

ఇప్పుడీ ప్రశ్న ఎందుకు వేస్తున్నాడో అర్థం చేసుకోలేక పోయాను.

సిన్సియర్‌గా జవాబు చెప్పాను.

"మృదుల కేంరా? ఏ మాత్రమూ వంక చూపించలేం ఆమెకి. అమ్మాయి రూపసి. అందుకు తగ్గ చదువు వున్నది. దానికి తోడుగా సంస్కారం కలది. బుద్ధిమంతురాలు. చక్కని చుక్క. ఆమెను పెళ్లాడబోయేవాడు ఎవడో కానీ లక్కీ ఫెలో"

ఆ కామెంటుకి సత్యం ఎంతో సంబర పడిపోతున్నట్లు అతని ముఖమే చెప్పింది.

"ఆ లక్కీ ఫెలోవి నీవే ఎందుకు కాకూడదు?" అడిగేడు.

రెండు నిముషాలు నాకు నోట మాట రాలేదు. ఆశ్చర్యంతో చూస్తూ వుండి పోయాను. నిజానికి ఇది ఒక గొప్ప ఆఫర్. మృదులలాంటి అందమైన యువతి భార్య అవుతుంటే ఎగిరి గంతు వెయ్యవల్సిన మాట. కట్నం సంగతి మర్చిపోయి ఎదురు కట్నం పిల్లకే ఇచ్చి కోవల్సిన మాట. ఆ అందానికి శాశ్వతంగా బానిసనై పడివుంటానని ఆ అమ్మాయికి ప్రోనోటు మీద రాసి ఇయ్యాల్సిన మాట.

కానీ ఇదంతా నా విషయంలో కాదు. కారణం ఆ రోజు రాత్రి జరిగిన సంఘటన. అందుకే నేను ఎగిరి గంతూ వెయ్యలేదు, చంకలు గుద్దుకోనూలేదు.

"ఆమె గురించి ఇంత చక్కని అభిప్రాయం చెప్పిన వాడివి ఏమిటిలా ఆలోచిస్తున్నావు?" అడిగేడు.

"నేనీ ఊరు ఇంటర్వ్యూ కోసం వచ్చినప్పుడు రాత్రిపూట నువ్వు ఫ్యాక్టరీకి వెళ్తూ మృదులని పక్క వారింట్లో పడుకోబెట్టావు. గుర్తుందా?" అన్నాను.

దెబ్బ తిన్నట్లు చూశాడు సత్యం.

"ఆ విషయం నాకు తెలియదని ఇన్నాళ్లూ అనుకున్నావు కానీ ఆ విషయం అప్పుడే తెల్సు నాకు"

"అయితే ఏమిటంటావు?" అన్నాడు కొంచెం అసహనంగా.

"చెప్తాను. అందుకు కారణం నీకు నా మీద నమ్మకంలేకనే అని నేనంటాను. నాతో ఇంత పరిచయం వుండి, నా గురించి ఇంతగా తెల్సిన నువ్వు నామీద ఇంత అపనమ్మకం కల్గివుండటం బాధ అన్పించింది. అందమైన అమ్మాయి అందుబాటులో వుండగానే నేను ఆమెకు అన్యాయం చేస్తానని నీ భయం. మృదుల

నీకు చెల్లెలు కావచ్చు కానీ ఆమెను నేను అంతకంటె ఎక్కువగా గౌరవిస్తాను. ఆ రోజు రాత్రి నిజానికి మృదుల మనసే చంచలమయ్యి తనతో పొందుకోసం నన్ను ఆహ్వానించినా ఆమెను వారించి తప్పు జరగకుండా చూసేంతటి మనో నిబ్బరం నాలో వుంది. ఆ నిబ్బరం నాలో వుందనీ, వుంటుందనీ నువ్వు ఊహించ లేదు. కనుకనే ఆ రోజు అలా ప్రవర్తించావు."

సత్యం మాట్లాడలేదు.

నేనే అన్నాను— "నాలో అంత నీచమైన భావాలు ఉన్నాయని భావించావు. నన్ను ఒక నెంబరు వన్ విలన్‌గా అను కున్నావు. ఆడపిల్ల కన్పడితే ఆమెను చెరచడమే పనిగా పెట్టుకున్న రోగ్‌లాగ నన్ను లెక్కవేశావు సరే నేనంత రోగ్‌నీ, విలన్‌నీ అయినప్పుడు అలాంటి వాడిని నీ చెల్లెలుకి ఇచ్చి పెళ్లి చెయ్యాలని ఎందుకు అనుకుంటావు? ఒకవేళ ఆ విషయం మర్చిపోయి నువ్వు అలా అడిగి వుండవచ్చు. కానీ నాకు గుర్తువుంది కనుక అలాంటి విలన్‌ని నీ బావగా రానివ్వను. అందుకే మృదులను చేసుకునేందుకు నేను అభ్యంతరం చెప్తున్నాను. ఆమెను పెళ్లి చేసుకోవడం కుదరని పని. "

ఆవేశంతో కాకుండా ఆలోచనతోటే ఆ నిర్ణయం తీసుకున్నవాడిలా అన్నాను.

"అది కాదురా. " ఏదో అన బోయాడు సత్యం. మధ్యలోనే అందు కున్నాను.

"ఆ పని చేసింది నీమీద నమ్మకం లేకకాదు. మా చెల్లాయి మీదనే నమ్మకం లేక అలా చేశాను ' అని అంటావేమో! అందుకు కూడా నా దగ్గర జవాబు సిద్ధంగా వుంది. మీ చెల్లాయిమీదనే నీకు నమ్మకం లేక ఆమెను మరొకరి ఇంట్లో పడుకో బెట్టావని అనుకుందాం. అంటే మీ చెల్లెలు చంచలస్వభావురాలు అన్నమాట. మగవాడు కన్పిస్తే కోరికలు దాచుకో లేనిది అన్నమాట.

"తనలో రేగిన సెక్సు వాంఛని తీర్చు కోవడంకోసం పరాయి మగవాడినైనా రెచ్చగొట్టే 'వాంప్' అన్నమాట. ఆ విషయం నీకు తెల్సు కనుకనే అలా ప్రవర్తించావు అన్నమాట .. ఒకవేళ అదే నిజమైతే అలాంటి 'వాంప్' అమ్మాయిని భరించే శక్తి నాకు లేదు. కట్టుబాట్లను విస్మరించి మగవాడి వెంట పడుగులు తీసే అమ్మాయి నాకు అక్కర్లేదు. అందుకే ఆమెను పెళ్లి చేసుకోలేను.

"కనుక ఆమెను పెళ్లిచేసుకోవడం కుదరని పని. "

సత్యం ముఖం పాలిపోయిందని స్పష్టంగా తెలుస్తోంది.

అందుకే ఇంకా మాట్లాడాలనివున్నా అంతటితో అపుచేశాను.

"మరొక్క విషయం చెప్పనివ్వు

నన్ను. నేను ఇంటర్వ్యూకని వచ్చిన రోజున పగటిపూట నన్ను, మృదులనీ ఒంటరిగా వదిలి వెళ్ళావు. అప్పుడు నీలో ఈ అనుమాన ప్రభూతం లేక పోయింది. అదేరోజు రాత్రి మమ్మల్ని అలా ఒంటరిగా వుంచలేకపోయావు. అంటే తప్పు అనేది జరిగితే రాత్రి పూటే జరుగుతుందనీ, పగటిపూట జరగదనీ నీ ఉద్దేశ్యమా ?. అదే నిజమైతే నీ అభిప్రాయం తప్పు. మనసులో ఏ పాపపు ఆలోచనా లేక పోతే అది రాత్రివేళ అయినా తప్పు జరగదు. అలా కాక తప్పుచెయ్యాలనే వాంఛ కనుక కల్గితే అందుకు పగలు అడ్డురాదు. నిజంగానే నాలో దురాలోచన వుంటే పగటిపూటే ఆ తప్పు జరిగి వుండేది. పగటిపూట తప్పు జరగలేదు కనుక రాత్రివేళ కూడా ఏమీకాదని నువ్వు నమ్మి వుండవల్సింది .. ఎనీవే ఆ విషయం ఇంక వదిలెయ్. లెటజ్ ఫర్ గెట్ ది హోల్ ఇష్యూ ..” వాతావరణాన్ని తేలిక చెయ్యాలనే ఉద్దేశ్యంతో నవ్వాను.

సత్యం మాత్రం నవ్వలేదు. అలాగే వుండిపోయాడు.

మరీ నిష్కర్షగా మాట్లాడి వాడి మనస్సు నొప్పించానా ? వాడి మనసు నొచ్చినా ఫర్వాలేదు. ఇన్నాళ్ళ నా మనసులో వున్నమాట బైటకు కక్కి-బరువు తగ్గించుకున్నాను. అంతే చాలు.

నిజంగా ఆనాడు సత్యం అలా ప్రవర్తించి వుండకపోతే మృదులను పెళ్ళిచేసుకుని తీరతానని కాగితం మీద స్టాంపు అంటించి మరీ రాసిఇచ్చేవాడిని. ఎందుకంటే మృదులలాంటి అందమైన యువతి భార్యకావటం ఒక అదృష్టంగానే నేను భావిస్తాను కనుక.

ఆ తర్వాత ఏవో నాల్గు జోకులు చెప్పి వాడిని నవ్వించి మామూలు ధోరణిలో పడేశాను.

ఆ రోజు ఇద్దరం కలిసే హోటల్లో భోజనం చేశాం. ఇద్దరమూ మ్యాటినీకి వెళ్ళాం.

ఆ తర్వాత మృదుల గురించి వాడు నాతో ఎప్పుడూ మాట్లాడలేదు.

* * *

తర్వాత మరో ఆరు నెలలు భూత కాలంలోకి వెళ్ళిపోయాయి. ఈ మధ్య కాలంలో మృదులకీ, నాకూ కూడా పెళ్ళయింది . అంటే పెళ్ళి మా ఇద్దరికీ కాదు . మృదుల పెళ్ళి ఎవరో సూర్యారావుతో, నా పెళ్ళి మృణాళినితో_

మృణాళినిది విశాఖపట్నం. వాళ్ళ నాన్నగారు పోర్టులో ఆఫీసరు. నేను మొదటిసారిగా పెళ్ళిచూపులకని వెళ్ళి చూసింది ఆమెనే. అన్నీ అలా కుదిరి రావడంతో నెలరోజుల క్రిందనే పెళ్ళయింది. నా పెళ్ళికి సత్యం రాలేక పోయాడు. అందులో వాడి తప్పులేదు. సరిగ్గా నా పెళ్ళి జరిగిన ముహూర్తానికే మృదుల పెళ్ళి వుంది. అదీ కారణం.

నేనూ అదే కారణం వల్లి మృదుల పెళ్ళికి వెళ్ళలేకపోయాను.

మృణాళినితో కొత్త కాపురంలోని కొత్త అనుభవాలతో హాయిగా రోజులు గడిపేస్తున్నాను. ఆ హాయి ఎలాంటిదో పెళ్ళయిన పాఠకులందరికీ తెల్సు కనుక ఇక్కడ రాయటంలేదు. పెళ్ళికాని పాఠకుల కోసం కూడా రాయటంలేదు. ముందే తెలిస్తే పెళ్ళయ్యాక 'సస్పెన్సు' పోతుందని.

సత్యం ఈ మధ్య ఫ్యాక్టరీలో ఎరీ బిజీగా వుంటున్నందున నేను నా భార్యను తీసుకువచ్చిన తర్వాత వాడు మా ఇంటికి రాలేదు. మేం ఇద్దరం బైట ఎక్కడో కల్సుకుని మాట్లాడుకోవడం వేరే సంగతి.

వాడిని ఇంటికి రమ్మని రోజూ కోరుతూనే వున్నాను.

చివరికి ఒక రోజు వీలుచూసుకుని వచ్చాడు.

నా భార్యను పరిచయం చేశాను. ఆ రోజు ఓ రెండు గంటలు నాతో గడిపాడు.

"నాకంటె పెద్దవాడివి. నా పెళ్ళి అయిపోయింది. నువ్వింకా చేసుకోలేదు .. " అన్నాను.

"మృదుల పెళ్లి గురించి ఆగాను. ఇంక తర్వాత ఛాన్సు నాదే. .." అన్నాడు నవ్వుతూ.

ఆ తర్వాత వాడు వెళ్లిపోయాడు.

సత్యం వెళ్లిపోయాక మృణాళిని అడిగింది నన్ను—

"ఏమండీ! మీ సత్యంగారు ఇదివరకు వైజాగ్‌లో ఉద్యోగం చేశారా ?"

"అవును. ఏం? అక్కడ చూసినట్లు గుర్తుందా అలా అడిగేవు? మీది ఆ వూరేగా " అన్నాను

"ఆయన ఇల్లు ఎక్కడ వుండేదో మీకు తెల్సా ?"

వాడు వైజాగ్‌లో వుండగా వాడికి ఉత్తరాలు రాసేవాడిని కనుక ఆ చిరునామా నాకు ఇంకా గుర్తుంది. అదే చెప్పాను మృణాళినితో.

"అవును ఆయనే ఈయన. నా అనుమానం నిజమే అయ్యింది. ఆ నుదురుమీద వున్న పెద్ద పుట్టుమచ్చ చూసే అనుకున్నాను. " అంది మృణాళిని.

సత్యం నుదుటిమీద పెద్ద పుట్టుమచ వుండటం నిజమే.

"ఏమిటి సంగతి ?" అన్నాను.

"ఈయన చాలా ప్రమాదకరమైన మనిషి. వైజాగ్‌లో ఓ అమ్మాయి ఆత్మ హత్యకు కారకుడు ఈయన...." అంది మృణాళిని, నాకు తెలియని నిజాన్ని బైటపెడుతూ.

నమ్మలేనట్లు చూశాను.

అది గమనించి కాబోలు మృణాళిని అంది_"నిజమేనండీ! ... నా మాట నిజం... ఈయన మా వీధిలోనే అద్దెకు

వుండేవారు ఒక ఇంట్లో వీధివైపు గదిలో. ఆ ఇంటాయన ఊరికి వెళ్ళిన సమయంలోనే ఇంటావిడకు జ్వరం వస్తే హాస్పటల్లో చేర్చారు. ఆ రాత్రి ఆ ఇంటి వాళ్ళమ్మాయి ఒక్కర్తే ఇంట్లో పడుకుంది. ఆ అమ్మాయి నా స్నేహితురాలే. ఆయనలో ఏం దుర్బుద్ధి పుట్టిందో ఆమె ఒంటరిగా ఉన్న సమయం చూసి ఆమెను బలవంతంగా అనుభవించేడు. ఆ అమ్మాయి ముందు ఎదిరించినా అతని పశుబలానికి లొంగిపోయింది. ఆ తర్వాత ఆమెను పెళ్ళిచేసుకుంటానని మాట ఇచ్చాడు. పరువు పోతుందనే ఉద్దేశ్యంతో ఆ అమ్మాయి నోర్మూసుకుని అతను పెళ్ళిచేసుకుంటాడని నమ్మకంతో వుంది. ఆ విషయం ఆ అమ్మాయి నాతో స్వయంగా చెప్పింది. తర్వాత ఆ అమాయకురాలు నెలతప్పితే తనకేం తెలియదన్నాడు. దాంతో ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత ఆయనకి బదిలీ అయ్యి వెళ్ళిపోయాడు....”

ఆ స్నేహితురాలు గుర్తు వచ్చి కాబోలు మృణాళిని గొంతు అఖర్లో బొంగురుపోయింది. ఆమె గొంతులోని సిన్సియారిటీ చూసి ఆమె మాటలు నమ్మాను.

ఆరోజు రాత్రి వాడు మృదులని వేరే వాళ్ళింట్లో పడుకోబెట్టడానికి కారణం అప్పుడు తోచింది నాకు. నేను కూడా వాడిలాగే ప్రవర్తిస్తానని భయపడ్డాడు. వాడిలో వున్న పశువాంఛ నాలోనూ ఎంటుందని నమ్మాడు. మృదులను ఇంట్లోనే వుంచితే ఆమెను నేను అనుభవిస్తానని అనుమానించాడు. తద్వారా మృదుల గర్భవతి అవుతుందని ఆలోచించాడు. తర్వాత ఆమెను నేను నిరాకరిస్తానని భయపడ్డాడు. అటు పిమ్మట ఆమె ఆత్మహత్య చేసుకుంటుందని వణికిపోయాడు. అందుకే అలా జాగ్రత్తపడ్డాడు.

కానీ, వాడికి తెలియని విషయం ఒకటుంది. నేను సత్యాన్ని కాదు. కౌండిన్యని. ఆ విషయం మర్చిపోయాడు.

ఎంతో అమాయకంగా కన్పించే సత్యం వెనుక ఇంత కథ వుందా?

‘చీకటి చాటున వున్న సత్యం ఇదన్న మాట’.

ఆలోచిస్తూ వుండిపోయాను.

“ఏమిటండీ ఏదో ఆలోచిస్తూ వుండిపోయారు!” నా భుజాలు కుదుపుతూ అడిగింది మృణాళిని.

ఆమె చేతిని నాచేతుల్లోకి తీసుకుంటూ—
“అబ్బే!.. .ఏం లేదు...” అన్నాను.